క్లుప్తంగా

కొణిదెనలో నేడు గడప గడపకు..

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ చింతలపేరయ్య అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ఎస్సీ కాలనీ నుంచి కార్యక్రమానికి ప్రారంభిస్తారని మండలస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని పేరయ్య కోరారు.

26న వీరాంజనేయుల తిరునాళ్ల

బల్లికురవ: మండలంలోని పెదంబడిపూడి గ్రామ సమీపంలోని చింతతోపులో వేంచేసి ఉన్న వీరాంజనేయుని 40వ వార్షిక తిరునాళ్ల బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆలయ అర్చకుడు గుడిమెళ్ల పవన్‌కుమార్ శర్మచే ఉదయం 5 గంటల నుంచే వీరాంజనేయుడికి ఆకుపూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రభలతోపాటు కోలాట ప్రదర్శన, వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆధ్వర్యంలో రెండు భారీ ఎలక్ట్రిక్ ప్రభలు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ వేడుకల్లో గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

నేడు కుంకలమర్రులో 'జగనన్నే మా భవిష్యత్'

కారంచేడు: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం మండలంలోని కుంకలమర్రు గ్రామంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆపార్టీ నాయకులు జువ్వా శివరామప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో చీరాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలోను ఆయన మాట్లాడతారన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

పంచాయతీ కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో హాజరుకావాలని ఎంపీడీవో ఆదేశించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందనకు అన్నీశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని ఆ ప్రభుత్వ శాఖకు బదిలీ చేస్తామని, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ సూచించారు.


పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి



చనిపోయిన గేదెల వద్ద ఉన్న యజమాని

అద్దంకి రూరల్: అకాల వర్షానికి పిడుగుపడటంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈఘటన మండలంలోని చక్రాయపాలెం గ్రామ పొలాల్లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. మండలంలోని చక్రాయపాలెం గ్రామానికి చెందిన గుమ్మడి నరసింహారావు ఇటీవల ఒక్కో గేదెను రూ. 80 వేల చొప్పున కొని మేపుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం గేదెలను తోలుకుని పొలానికి వెళ్లగా ఇంతలో వర్షం పడటంతో గేదెలకు దూరంగా వెళ్లి నిలుచున్నాడు. ఈ క్రమంలో రెండు గేదెలపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాయి. రెండు గేదెల విలువ రూ.1.60 లక్షలు అవుతాయని, అవే జీవనాధారంగా జీవిస్తున్న తనకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని గేదెల యజమాని కోరారు.

ఆమంచి చొరవతో గండ్లు పూడ్చివేత



మరమ్మతులు చేస్తున్న అధికారులు

చినగంజాం: వాహనదారులకు ఇబ్బందిగా మారిన గుంతలను సంబంధిత శాఖాధికారులు పూడ్చి వేశారు. పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కడవకుదురు, గొనసపూడిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు సమస్యను ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. సమస్య పట్ల వెంటనే స్పందించిన ఆమంచి అధికారులను రోడ్డు మార్జిన్ మరమ్మతు పనులు పూర్తి చేసి గండ్లు పూడ్చాల్సిందిగా సూచించారు.

షాక్ కొడుతున్న మొండి బకాయిలు

- విద్యుత్ శాఖకు బకాయిల భారం
- ఏళ్ల తరబడి వసూలు కాని మొండి బకాయిలతో సతమతం
- డివిజన్ పరిధిలో పేరుకుపోయిన బకాయిలు రూ.25.90 కోట్లు



విద్యుత్ సబ్‌స్టేషన్

అద్దంకి: మొండి బకాయిలు అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకు తలనొప్పిగా మారాయి. ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాలు తమ బాధ్యతగా పన్నులు చెల్లిస్తేనే ప్రభుత్వం మరింతగా అభివృద్ధి చేసేందుకు ముందుకు సాగుతుంది. ఏళ్ల తరబడి బకాయిలు వసూలు కాకపోవడంతో విద్యుత్ శాఖ డీలా పడిపోతోంది. క్రమం తప్పకుండా నెలనెలా చెల్లించాల్సిన పంచాయతీలు, వివిధ కార్యాలయాలు వినియోగించుకున్న విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో తడిసి మోపడయ్యాయి. మొండి బకాయిలుగా మారాయి. ఫలితంగా డివిజన్ పరిధిలోని అద్దంకి, అద్దంకి రూరల్, మార్టూరు, సంతమాగులూరు, జే. పంగులూరు, కొరిశపాడు, బల్లికురవ, యద్దనపూడి మండలాల పరిధిలో 706, పంచాయతీ కనెక్షన్లు, 863 ప్రభుత్వ కార్యాలయాల కనెక్షన్ల బకాయిలు ఇబ్బడిముబ్బడిగా పేరకుపోయాయి. డివిజన్ పరిధిలో మొత్తం రూ. 25.90 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉందని ఈఈ మస్తాన్‌రావు చెబుతున్నారు. ఇందులో డివిజన్ పరిధిలోని పంచాయతీల బాకాయిలు రూ.12.16 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.5.27 కోట్లు, వ్యవసాయేతర కనెక్షన్ల బకాయిలు రూ.11.66 కోట్లు, అగ్రికల్చర్ బకాయిలు రూ.2.08 కోట్లు ఉన్నాయి.

అత్యధిక బకాయి ఉన్న పంచాయతీలు..

డివిజన్ పరిధిలోని కొప్పరం రూ.1.92 కోట్లు, మార్టూరు చింతపిల్లిపాడు రూ.1.21 కోట్లు, బండివారిపాలెం రూ.1.10 కోట్లు, మున్నంగివారిపాలెం రూ.0.43 కోట్లు, తాటివారిపాలెం రూ.0.31 కోట్లు, జే పంగులూరు రూ.1.38కోట్లు, చందలూరు రూ.0.84 కోట్లు, ఆరికట్లవారిపాలెం రూ.0.15 కోట్లు, మేదరమెట్ల రూ.0.75 కోట్లు మేర బకాయిలు ఉన్నాయి.

రోజు వారీ వినియోగం..

మార్చి 2023 వరకు రోజు వారీ వినియోగం 1.50 మిలియన్ యూనిట్లుగా ఉంది. అయితే రోజు వారీ కోటా 1.77 మిలియన్ యూనిట్లు కేటాయింపు ఉందని అధికారులు తెలిపారు. అంటే ప్రస్తుతం డివిజన్‌లో రోజు వారీ కోటా కేటాయింపునకు అదనంగా ఉందని విద్యుత్ డివిజన్ ఈఈ మస్తాన్‌రావు చెప్పారు. అత్యధిక బకాయి ఉన్న పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యసాయేతర కనెక్షన్ల ద్వారా పేరుకుపోయిన బిల్లులను చెల్లిస్తే విద్యుత్ శాఖపై భారం తగ్గుతుందని చెప్తున్నారు. బిల్లులు చెల్లించే విధంగా చూడాలని కోరుతున్నారు.

బకాయిలు చెల్లించాలి..



డివిజన్ పరిధిలో రూ.25.90 కోట్లు పంచాయతీ, ప్రభుత్వ, వ్యవసాయేతర కనెక్షన్ల వినియోగదారుల నుంచి రావాల్సి ఉంది. ఆయా బాకాయిలు చెల్లిస్తే విద్యుత్‌శాఖకు భారం తగ్గుతుంది. అదే విధంగా వేసవిలో విద్యుత్ కోతలు ఉండవు. వినియోగానికి మించే కోటా కరెంట్ అందుబాటులో ఉంది. ఎవరూ భయపడాల్సిన పనిలేదు.

– మస్తాన్‌రావు, ఈఈ

వాడరేవుకు పోటెత్తిన జనం



వాడరేవు తీరంలో ఉత్సాహంగా గడుపుతున్న ముస్లింలు



బందోబస్తు చర్యలు చేపట్టిన మెరైన్ ఎస్సై సుబ్బారావు, సిబ్బంది

- సముద్ర తీరానికి వేలాదిగా ముస్లింలు

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. ముస్లింలకు అతిపెద్ద పండుగైన రంజాన్ పండుగ అనంతరం ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి సముద్ర స్నానాలు ఆచరిస్తుంటారు. దీంతో ఆదివారం ఓడరేవుకు పోటెత్తారు. కోలాహలంగా మారింది. ఆదివారం కావటంతో ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో గడిపారు. తీరం ఒడ్డున యువకులు సేదతీరుతూ సముద్రపు ఇసుకతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు. చీరాల వాడరేవు తీరానికి పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి, ప్రత్తిపాడు, గుంటూరు ప్రాంతాలకు చెందిన ముస్లింలు తమ కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించారు. హైద్రాబాద్, వరంగల్, నిజామాబాద్, తదితర ప్రాంతాల నుంచి కూడా ముస్లింలు అధికంగా వాడరేవుకు చేరుకుని స్నానాలు ఆచరించారు. దీంతో వాడరేవులో కోలాహలం నెలకొంది. మెరైన్ ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో మెరైన్ పోలీసులు, ఏఆర్ పోలీసులు, సివిల్ పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. సముద్రంలో లోతుకు ఎవ్వరిని వెళ్లనివ్వకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. వాచ్ టవర్, ఏఈటీ వాహనం, మైక్ అనౌన్స్‌లు చేపట్టారు. వాడరేవులో ట్రాఫిక్ సమస్య లేకుండా పట్టణ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు.

ఘనంగా కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు



అద్దంకి భవాని సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, నాయికులు

అద్దంకి రూరల్: రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు ఆదివారం అద్దంకి పట్టణంతో పాటు, మండలంలోని పలుగ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక భవానిసెంటర్ వద్ద భారీ కేక్ కట్ చేసి కృష్ణచైతన్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎల్. ఎస్తేరమ్మ మాట్లాడారు. చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో రాధకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కృష్ణచైతన్య జన్మదిన వేడుకల సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అద్దంకి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు దేసుపద్మేష్, అనంతలక్ష్మీ, కౌన్సిలర్‌లు బాలు, సుధీర్, నాగరాజు, గుంజి కోటేశ్వరరావు, స్థానిక నాయకులు సందిరెడ్డి రమేష్, కార్పొరేషన్ డైరక్టర్‌లు కొల్లా భవనేశ్వరీ, షేక్‌బాజీ, స్వర్ణసోని, చిన్న శ్రీమన్నారాయణ, పీ. రోశయ్య, రామకోటేశ్వరరావు, చెన్నుపల్లి శ్రీనివాసచారి, ఉడత్తు సురేష్, పాఠశాల నిర్వాహకురాలు పూనూరి ఆరోగ్యం, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- శింగరకొండ పాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎర్రిబోయిన తిరుపతయ్య ఆధ్వర్యంలో, మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద కృష్ణచైతన్య జన్మదిన వేడుకల సందర్భంగా భారీ కేక్ కట్‌చేసి చైతన్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
- వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ ఆధ్వర్యంలో, రావినూతలలో సర్పంచ్ చాట్ల విజయవీణ ఆధ్వర్యంలో కృష్ణచైతన్య పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు.

జే.పంగులూరు: పంగులూరు బస్టాండ్ సెంటర్ మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు రాయిణి వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జెడ్పీటీసీ రాయిని ప్రమీళ, పంగులూరు సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యర్రం గోపాల్‌రెడ్డి, గాదే బ్రహ్మారెడ్డి, గంగాధర్, వీరయ్య, నాగేశ్వరావు, నలమాల అజీత్ కుమార్, రంగారావు,రామారావు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



అద్దంకిలో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు అందజేస్తున్న వైస్ చైర్మన్



మేదరమెట్లలో కృష్ణచైతన్య పుట్టిన రోజు కేక్ కట్‌చేస్తున్న నాయకులు

గాలివాన.. ఉరుములు మెరుపులు



అద్దంకి: వర్షంతో రోడ్డుపై నిలిచిన నీరు



అద్దంకి: గాలికి ఒరిగిన చెట్ల కొమ్మలు



గుంటుపల్లిలో మొక్కజొన్న, మిర్చి పంటలకు పరదాలు కప్పిన రైతులు

అద్దంకి/బల్లికురవ: వాతావరణ శాఖ హెచ్చరించిన విధంగానే మండలంలో ఆదివారం గాలి వాన, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అయితే ప్రస్తుతం అద్దంకి, బొమ్మనంపాడు తదితర గ్రామాల పొలాల్లో కొంత మేర మొక్కజొన్న విత్తనాలు కళ్లాల్లో ఉండంతో రైతులు అప్రమత్తం అయ్యారు. పట్టణంలో పలువురు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, కటౌట్లు నేలవాలగా అధికారులు తొలగించారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు, మామిళ్లపల్లి గ్రామాల్లో వర్షం కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

- బల్లికురవ మండలంలో ఆదివారం సాయంత్రం గంటన్నరపాటు వడగండ్ల వర్షం కురిసింది. బల్లికురవ, గుంటుపల్లి, కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, కొణిదెన, వేమవరం, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కోటావారిపాలెం, చెన్నుపల్లి, కొప్పరపాలెం, గంగపాలెం గ్రామాల్లో మిర్చి, మొక్కజొన్న పంటలు కళ్లాల్లో ఉన్నాయి. వర్ష సూచనతో కళ్లాలోని పంటలను ఒక్కచోటకు చేర్చుకుని తడవకుండా సంరక్షించుకున్నారు.

మార్టూరు: మండలంలో వలపర్ల, ద్వారకపాడు తదితర గ్రామాల్లో వరి పంట కోత కోసి పొలాలలోనే ఉండగా ఆ గ్రామాలతోపాటు కోలలపూడి, బొల్లాపల్లి, చిమ్మిరిబండ, నాగరాజుపల్లి తదితర గ్రామాలలో మొక్కజొన్న కండెలు కోసి ఆరబెట్టుకున్న రైతులు అకాల వర్షానికి పాడైపోకుండా పరదాలు కప్పి రక్షించుకునే ప్రయత్నం చేశారు.



ద్వారకపాడులో వర్షానికి తడిసిన వరి ఓదెలు

పుస్తక పఠనంతో మానసిక వృద్ధి

అద్దంకి: పుస్తక పఠనంతో మానసిక వృద్ధి కలుగుతుందని లైబ్రేరియన్ బాదం విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం సంతమాగులూరు గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా పాఠశాలల విద్యార్థులతో వివిధ రకాల పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఖాళీ సమయాల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదవాలన్నారు. పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న లైబ్రేరియన్ విజయభాస్కరరెడ్డి

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి చందనాలంకారం



చందనాలంకారంలో శ్రీవారు

చీరాల టౌన్: అక్షయ తృతీయ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వేంచేసి ఉన్న లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి మందిరంలో ఆదివారం ఉదయం శ్రీవారికి విశేష పూజలు జరిగాయి. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా చందనాలంకారం చేసి విశేషార్చనను ఆలయ అర్చక స్వామి భువనేశ్వర శర్మ జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమాన్ని మందిర కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

చీరాల టౌన్: రోటరీ క్లబ్, గీతా యంగ్ సైంటిస్ట్ ఆధ్వర్యంలో చీరాల ప్రసాద్ నగర్లోని డాబెరో బాలికల వసతి గృహంలో 40 మంది బాలికలకు దుస్తులు పంపిణీ ఏశారు. ఈసందర్భంగా దాత డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ మరికొన్ని వసతి గృహాల్లో 250 జతలు వస్తువులు సద్ధం చేసి ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో వలివేటి మురళీ కృష్ణ,బాల వెంకటేశ్వరరావు, బి.హేమంత్ కుమార్, వార్డెన్ నాగమల్లేశ్వరి, రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు, బాలికలు పాల్గొన్నారు.

నేడు ఇంకొల్లు మండల సమావేశం

చినగంజాం: మండల సర్వసభ్య సమావేశం 24వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరుకానున్న దృష్ట్యా మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు రావాలని ఆయన కోరారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. ఉత్తరాయణం వైశాఖ మాసం మృగశిర నక్షత్రం చవితి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

గాయపడిన వ్యక్తి మృతి

అద్దంకి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వైద్యశాలలో చికిత్స పొందతూ ఆదివారం మృతి చెందినట్లు మృతుడి భార్య కేజియా ఫిర్యాదు మేరకు ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. పల్నాడు జిల్లా వినుకొండ మండలం భారతీపురం గ్రామానికి చెందిన ఉక్కాలపు జాషువా (35) విజయవాడలో బేల్దారి పనులు చేస్తుంటాడు. ప్రతి శనివారం సాయంత్రం బైకుమీద ఇంటికి వచ్చి మరలా సోమవారం ఉదయం విజయవాడ వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వస్తుండగా సంతమాగులూరు, పుట్టావారిపాలెం మధ్యగల అనంతలక్ష్మీ హోటల్ వద్దకు రాగానే ఎదరుగా వస్తున్న మిరపకాయ లోడ్ ఆటో ఢీకొట్టింది. రక్తగాయాలై జాషువా రోడ్డుమీద పడిఉండటంతో స్థానికులు 108 వాహనంలో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

వైష్ణవాలయంలో ప్రత్యేక పూజలు



వేడుకల్లో కుంకుమ అలంకరణలో అమ్మవారు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు నడిబొడ్డున రెండు తాగునీటి చెరువుల మధ్యన కొలువైన శ్రీవైష్ణవీ దుర్గాలయం 22వ వార్షికోత్సవాలు శనివారం కన్నుల పండువగా ప్రాంరంభమయ్యాయి. ఆదివారం స్థానిక వైష్ణవాలయంలో ఉదయం నుంచి ఆలయ ధర్మకర్తలు, ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ భక్త మండలి ఆధ్వర్యంలో లలితా పారాయణం నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

రోటరీ ఆధ్వర్యంలో గుడ్డ సంచుల పంపిణీ

కారంచేడు: రోటరీ క్లబ్ పర్చూరు వారి ఆధ్వర్యంలో గ్రామస్తులకు గుడ్డ చేతి సంచులను పంపిణీ చేశారు. మండలంలోని పోతినవారిపాలెం గ్రామ సర్పంచ్ పోతిన శ్రీనివాసరావు సహకారంతో సంచులను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతు గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు కొల్లా నాగబాబు, కోమటి ఆంజనేయులు, గ్రామస్తులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సంచులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు